మన రాజధాని
# రక్షణ
## ఉమ్మడి గుంటూరు
శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 పేజీలు : 4

## యువతకు సివిల్స్ లక్ష్యంగా శిక్షణ

రాష్ట్రంలో 200 మంది అభ్యర్థులకు మూడేళ్లపాటు ఉచిత సివిల్స్ శిక్షణ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రి పార్థసారథి సచివాలయంలో బ్రోచర్‌ను విడుదల చేశారు.



సివిల్స్‌లో రాణించాలనే ఆశయంతో ఉన్న 200 మంది యువతకు మూడేళ్లపాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో శిక్షణ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. విజయవాడ, వినుకొండ కేంద్రాల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. వివరాలు 2లో..

- ఫైల్ తెరవాలంటే ఫీజు... మూయాలంటే మరింత ఫీజు!
- ఆర్ఐ నీడలో కోవర్టుల రాజ్యం...
- వీఆర్వోల పాత్ర శూన్యం?
- ఔట్సోర్సింగ్ పేరిట
- అనధికారిక గ్యాంగ్... నిబంధనలకు తూట్లు
- ఐ వి ఆర్ సర్వే హెచ్చరికలు పట్టించుకోని పరిపాలనా యంత్రాంగం
- ఇప్పుడు విచారణ జరగకపోతే ప్రజా విశ్వాసం పూర్తిగా కూలిపోతుంది



# సేవా కేంద్రం కాదు...
# వసూళ్ల కేంద్రం
## బాపట్ల రెవెన్యూలో అవినీతి సామ్రాజ్యం

బాపట్ల జిల్లా హెడ్‌క్వార్టర్‌లోని మండల రెవెన్యూ కార్యాలయం ఇప్పుడు ప్రజల దృష్టిలో "సేవా కేంద్రం" కాదు... "వసూళ్ల కేంద్రం"గా మారిందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రతి ఫైలుకూ ధర, ప్రతి సంతకానికీ రేటు అన్నట్టుగా వ్యవహారం నడుస్తోందన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. కలెక్టర్ ఆదేశాలు పైకే పరిమితమవుతున్నాయా? క్షేత్రస్థాయిలో అవినీతి అడ్డుకట్టలేకుండా విస్తరిస్తోందా? అన్న ప్రశ్నలు సామాన్యుడిని వేధిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో బాపట్ల రెవెన్యూ వ్యవస్థపై తక్షణ, ఎంక్వయిరీ జరగాల్సిందేనన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.


బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో



వివరాలు 2లో..

## సూర్యలంక పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా కలెక్టర్ గోవా పర్యటన

బాపట్ల తీరాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ గోవా పర్యటనలో కీలక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును కలుసుకుని బీచ్ నిర్వహణ, భద్రత, పర్యావరణ పరిరక్షణ, పర్యాటకాభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించి గోవా నమూనాలను అమలు చేయాలనే సంకల్పాన్ని వెల్లడించారు.



వివరాలు 2లో..

## వేల్పూరులో కాంగ్రెస్ రచ్చబండ

**మహాత్మాగాంధీ ఆశయాలను కాపాడాలి: షర్మిల పిలుపు**

- వేల్పూరు రచ్చబండ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మహాత్మాగాంధీ ఆశయాలను కాపాడాలని పిలుపునిచ్చారు.
- గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.
- ప్రజలు చైతన్యంతో ముందుకు వచ్చి ప్రజాహిత పథకాలను రక్షించాలని ఆమె కోరారు.



వివరాలు 2లో..

## ధూళిపాళ్ల తల్లి ఇంటి చోరీ నిందితుడు అరెస్ట్

- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తల్లి ప్రమీలాదేవి
- ఇంట్లో జరిగిన భారీ చోరీ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు 2లో..

పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తల్లి ప్రమీలాదేవి ఇంట్లో రూ.70 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కేసులో ఓ వైసీపీ సర్పంచ్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## సూర్యలంక పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా కలెక్టర్ గోవా పర్యటన

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్

తీర ప్రాంత అభివృద్ధి, బీచ్ నిర్వహణ, భద్రతా చర్యలు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై గోవాలో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయడానికి బాపట్ల జిల్లా అధికారుల బృందం పర్యటిస్తోంది. ఈ సందర్భంగా గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును కలిసిన కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ బాపట్ల తీరాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గోవా నమూనానఅనుసరించనున్నట్లు తెలిపారు.గోవాలో బీచ్ శుభ్రత, భద్రతా పర్యవేక్షణ, పర్యాటక సౌకర్యాల విస్తరణ, స్థానికులకు ఉపాధి అవకాశాల సృష్టి వంటి అంశాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బాపట్ల తీరంలో కూడా మౌలిక వసతుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు.ఈ పర్యటన ద్వారా బాపట్ల జిల్లాకు కొత్త అవకాశాలు ఏర్పడి, పర్యాటక రంగం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## వేల్పూరులో కాంగ్రెస్ రచ్చబండ

మొదటి పేజీ తరువాయి

వినుకొండ రక్షణ న్యూస్

పీసీసీ అధ్యక్షురాలు వై ఎస్ షర్మిల మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆశయాలను బీజేపీ దెబ్బతీస్తోందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ సభ్యుడు నాథురామ్ గాడ్సే గాంధీజీని హత్య చేసినట్లు చరిత్ర చెబుతుందని, ప్రస్తుతం ఆయన ఆలోచనలను బలహీనపరచే చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు.మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాహిత పథకాలపై నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధూళిపాళ్ల తల్లి ఇంటి చోరీ: నిందితుడు అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

పొన్నూరు రక్షణ న్యూస్

చింతలపూడిలోని ప్రమీలాదేవి నివాసంలో ఇటీవల రూ.70 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీకు గురయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పొన్నూరు పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఏలూరు జిల్లా పెదపాడుకు చెందిన రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.రాజేష్‌పై పెదపాడు పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఒక కేసులో నాలుగు రోజుల క్రితమే జైలు నుంచి బెయిల్‌పై విడుదలైనట్లు వెల్లడించారు. ఒంగోలులో వాలీబాల్ ఆడేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ చోరీకి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.నిందితుడి నుంచి సుమారు 10 కిలోల వెండి స్వాధీనం చేసుకోగా, కొంత బంగారం విక్రయించినట్లు సమాచారం. మిగిలిన ఆభరణాలను ఏలూరులోని ఓ వైసీపీ సర్పంచ్ ఇంట్లో దాచినట్లు విచారణలో గుర్తించారు. సంబంధిత సర్పంచ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.ఏలూరు పోలీసుల సహకారంతో నిందితుడిని పట్టుకున్నట్లు పొన్నూరు పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు

# సేవా కేంద్రం కాదు...వసూళ్ల కేంద్రం

మొదటి పేజీ తరువాయి

“డబ్బు ఉంటే పని... లేకపోతే వాయిదా” అన్న మాట ఇప్పుడు బాపట్ల మండల రెవెన్యూ కార్యాలయానికి సరిపోయే నానుడిగా మారిందన్న ఆరోపణలు జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారాయి. జనన--మరణ ధ్రువపత్రాలు, కుటుంబ పత్రాలు, భూ సంబంధిత ఫైళ్లు... ఏదైనా సరే, పైసా లేకుండా కదలదన్న ఆరోపణలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఇది వదంతి కాదు, నిత్యానుభవమని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

**పగలు మౌనం... రాత్రి ఫైళ్ల చలనం?**

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పగటిపూట అందుబాటులో ఉండకపోవడం, రాత్రిళ్లు కార్యాలయంలో “పని” జరుగుతుందన్న సమాచారం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతోంది. రాత్రి వేళల్లో ఏ ఫైళ్లు కదులుతున్నాయి? ఎవరి కోసం? ఏ ప్రతిఫలంతో? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నెలవారీ వసూళ్లకు టార్గెట్లు పెట్టి వ్యవహారం సాగుతోందన్న ప్రచారం పరిస్థితిని మరింత అనుమానాస్పదంగా మారుస్తోంది.

**ఔట్సోర్సింగ్ కాదు... అనధికారిక దందా?**

తాజాగా వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం, మండల రెవెన్యూ కార్యాలయంలో అనధికారికంగా ఆరుగురు వ్యక్తులు ఔట్సోర్సింగ్ పేరిట కీలక పనుల్లో జోక్యం చేసుకుంటున్నారు. వీరికి ప్రభుత్వంతో ప్రత్యక్ష సంబంధం లేదన్న ప్రచారం ఉన్నా, ఫైళ్లపై మాత్రం పూర్తి ఆధిపత్యం చెలాయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూపంచాయతీలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాల విషయంలో వీరే మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ రేట్లు నిర్ణయిస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.

ఇక్కడ అసలు ప్రశ్న---

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వీరు ఏ జీవో ఆధారంగా కార్యాలయంలో పనిచేస్తున్నారు?

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఈ స్థాయి అధికారాలు ఎవరు ఇచ్చారు?

అన్న ప్రశ్నలకు ఇప్పటివరకు సమాధానం లేదు.

**వీఆర్వోలు -- పేరుకే ఉద్యోగులా?**

ప్రభుత్వ ఉద్యోగులైన వీఆర్వోలు తమ విధులు నిర్వర్తించలేని స్థితికి నెట్టివేయబడుతున్నారన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. అవుట్‌సోర్సింగ్ వ్యక్తులు ఆదేశాలు జారీ చేయడం, వీఆర్వోలపై పెత్తనం చెలాయించడం పరిపాలనా వ్యవస్థనే అపహాస్యం చేస్తోంది. “మేము కేవలం సంతకాలు పెట్టే బొమ్మలమయ్యాం” అన్న వీఆర్వోల మాటలు పరిస్థితి తీవ్రతను చాటుతున్నాయి.

ఈ దుస్థితికి తట్టుకోలేక బాపట్ల మండల పరిధిలోని పలువురు వీఆర్వోలు కలెక్టరేట్‌కు వలస వెళ్లిపోయినట్టు సమాచారం. ఇది వ్యక్తిగత సమస్య కాదు... ఇది వ్యవస్థ కూలిపోతున్న సంకేతం.

**ఆరేళ్లుగా ఇంక్రిమెంట్ లేదు... ఒత్తిడి మాత్రం పెరిగింది**

వీఆర్వోల ఆవేదన మరో కోణంలోనూ తీవ్రంగా ఉంది. గత ఆరేళు ్లగా ఒక్క ఇంక్రిమెంట్ కూడా లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలు అందకపోవడం. కనీసం మెడికల్ బిల్లులు కూడా క్లియర్ కాకపోవడం. దీనికి తోడు “మాట వినకపోతే ఫైళ్లు కదలవు” అన్న మానసిక ఒత్తిడి. ఇది ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఐ వి ఆర్ సర్వే -- హెచ్చరికా, నిర్లక్ష్యమా?**

ప్రభుత్వం నిర్వహించిన ఐ వి ఆర్ సర్వేల్లో బాపట్ల జిల్లా పేరు అవినీతి ఆరోపణలతో ముందుకు రావడం సాధారణ విషయం కాదని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రజల స్పందన ఆధారంగా వచ్చిన ఈ నివేదికను పట్టించుకోకపోతే, పరిపాలనపై నమ్మకం పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**కుటుంబ పత్రానికి రూ.10--30 వేలు... నిజమెంత?**

ప్రజల్లో ఎక్కువగా వినిపిస్తున్న ఆరోపణ---కుటుంబ పత్రాల కోసం రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు జరుగుతోందన్నది. ఈ మొత్తం నేరుగా కాకుండా, మధ్యవర్తులైన కోవర్థుల ద్వారా వెళ్లుతోందన్న ప్రచారం మరింత కలకలం రేపుతోంది. కనీస అర్హతలేని వ్యక్తులు ఫైళ్లు క్లియర్ చేస్తున్నారన్న ఆరోపణలు పరిపాలనా వ్యవస్థను మరింత అనుమానాస్పదంగా మారుస్తున్నాయి.

**కలెక్టర్ దృష్టిలో ఉందా... ?**

బాపట్ల మండల రెవెన్యూ కార్యాలయంపై జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఇప్పటికే దృష్టి పెట్టినట్లుగా సమాచారం. ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరించాలని అధికారులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ, ఇటీవలి కాలంలో మండల కార్యాలయ అధికారుల పనితీరుపై కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలిసింది. మార్పు రావాలని, లేకపోతే చర్యలు తప్పవని స్పష్టమైన హెచ్చరికలు ఇచ్చినట్టుగా కూడా సమాచారం.

అయితే జిల్లాలో కీలకమైన మండల రెవెన్యూ కార్యాలయం అభివృద్ధి, ప్రజాసేవలో ప్రత్యేక పాత్ర పోషించాల్సిన స్థానం నుంచి అవినీతి ఆరోపణల కేంద్రంగా మారుతోందన్న విమర్శలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజల సమస్యలకు పరిష్కారం అందించాల్సిన కార్యాలయంలో అనుమానాలు, ఆరోపణలు పెరుగుతుండటం పరిపాలనపై విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది.

ఈ నేపథ్యంలో మండల రెవెన్యూ కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై సమగ్ర ఎంక్వయిరీ జరిపితే మరికొన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అటు కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది, ఇటు ప్రజలు బహిరంగంగానే కోరుకుంటున్నారు.

## యువతకు సివిల్స్ లక్ష్యంగా శిక్షణ

మొదటి పేజీ తరువాయి

అమరావతి రక్షణ న్యూస్

సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఉచిత సివిల్స్ శిక్షణ దరఖాస్తుల బ్రోచర్‌ను రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, మరియు బాపట్ల జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొలుసు పార్థసారథి విడుదల చేశారు. చలసాని బలరామ ప్రసాద్ (సీబీఆర్) అకాడమీ ఆధ్వర్యంలో ఎంపిక కాబోయే 200 మంది అభ్యర్థులకు మూడేళ్లపాటు పూర్తిగా ఉచితంగా శిక్షణ అందించనున్నారు మంత్రులు తెలియజేశారు. ఇందులో వంద మంది యువతులు, వంద మంది యువకులు ఉంటారని నిర్వాహకులు తెలిపారు.అభ్యర్థుల ఎంపిక కోసం వచ్చే నెల 15న యువతులకు, ఏప్రిల్ 5న యువకులకు విడివిడిగా రాత పరీక్షలు నిర్వహించనున్నారు. రాత పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించి తుది ఎంపిక చేస్తారు. యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ (ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్--1, 2) వంటి పోటీ పరీక్షలకు అభ్యర్థులను సిద్ధం చేయనున్నట్లు డాక్టర్ లక్ష్మయ్య (ఐఏఎస్ స్టడీ సర్కిల్) తెలిపారు.విజయవాడలోని కేంద్రంలో అమ్మాయిలకు, వినుకొండలోని కేంద్రంలో అబ్బాయిలకు శిక్షణ ఇస్తారు. ప్రముఖ సామాజిక సేవకుడు చలసాని బలరామ ప్రసాద్ అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తుండగా, డాక్టర్ లక్ష్మయ్య సంస్థ ఉచితంగా శిక్షణ అందించనుంది. ఒక్కో అభ్యర్థిపై మూడేళ్లలో సుమారు రూ.10 లక్షల వరకు వ్యయం అవుతుందని నిర్వాహకులు వెల్లడించారు.మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో ధర్మవరం నియోజకవర్గం నుంచి ఎంపికైన 28 మంది యువతులు ఇప్పటికే హైదరాబాదులో తొమ్మిది నెలలుగా ఉచిత శిక్షణ పొందుతున్నారని తెలిపారు. వారికి మరో రెండేళ్లు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితోనే మరో 200 మందికి శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, వరదరాజుల రెడ్డి పాల్గొన్నారు.

RAKSHANA_praja jyothi Medhak.qxd 2/20/2026 6:01 AM Page 3



# శివాజీ మహారాజ్ ఆశయాలు ప్రతి భారతీయునికి ఆదర్శం.. తాండ్ర

**ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు**

**కర్లపాలెం రక్షణ న్యూస్**



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామ పరిధిలో అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించారు. సైనికుడు బోలగాని గోపికృష్ణ తన నివాస ప్రాంగణంలో స్వయంగా ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ విగ్రహానికి రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం హిందూ ధార్మిక ధ్వజాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కర్లపాలెం మండల రెవెన్యూ అధికారి శ్రీమతి శ్రీదేవి కూడా పాల్గొని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ, దేశభక్తికి, పౌరుషానికి, వీరత్వానికి ప్రతీకగా నిలిచిన మహనీయులు శివాజీ మహారాజ్ మరియు సంభాజీ మహారాజ్ అని కొనియాడారు. శివాజీ మహారాజ్ హిందూ ధర్మాభిమాని అయినప్పటికీ, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందించిన గొప్ప నాయకుడని తెలిపారు. బాపట్ల జిల్లా ప్రాంతంలోని విద్యార్థుల్లో దేశభక్తి భావం పెంపొందించేందుకు శివాజీ మహారాజ్ విగ్రహాన్ని స్థాపించిన సైనికుడు బోలగాని గోపికృష్ణను, ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమం ముగింపులో శివాజీ మహారాజ్ మరియు భారతమాతకు జైకారాలు పలికారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల ఎలక్ట్రికల్ ఇన్‌చార్జు దుర్గా ప్రసాద్, బాపట్ల మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు పుట్టా ఆదిశేషా రెడ్డి, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, జాయింట్ సెక్రటరీ పీటా సారథి, రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారులు సుంకర శేషగిరి రావు, సీనియర్ మాజీ సైనికులు పసుపులేటి ప్రసాద్, తదితరులు, చింతాయపాలెం పాఠశాల చీజ ఉపాధ్యాయులు బోలగాని సురేంద్ర, విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నగర పారిశుధ్యానికి ప్రాధాన్యం

**గుంటూరు నగరంలో పలు వార్డులలో పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించిన కమిషనర్ మయూరి అశోక్..**



**గుంటూరు రక్షణ న్యూస్**

నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు వ్యర్థాల పునర్వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా గుంటూరు నగరపాలక సంస్థ కీలక చర్యలు చేపడుతోంది. ఈ మేరకు తడి వ్యర్థాల నిర్వహణకు విండ్రో కంపోస్ట్ యూనిట్, నిర్మాణ వ్యర్థాల శాస్త్రీయ శుద్ధికి సిఅండ్‌డి వేస్ట్ ట్రీట్మెంట్ ప్లాంట్, వ్యర్థాల నుండి ఇంధనం ఉత్పత్తి చేసే బయోగ్యాస్ ప్లాంట్‌లను శాశ్వత ప్రాతిపదికగా ఏర్పాటు చేయనున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. గురువారం నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్ సమీపంలో ప్రతిపాదిత స్థలాన్ని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. గుర్తించిన స్థలాన్ని ప్లాంట్ల ఏర్పాటుకు అనుకూలంగా తక్షణమే సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర మ్యాప్‌ను రూపొందించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ జరగాల్సిన అవసరం ఉందని, ఈ ప్లాంట్లు అందుబాటులోకి వస్తే నగర పారిశుద్ధ్యంలో గణనీయమైన మార్పులు చోటుచేసు కుంటాయని కమిషనర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఈఈ విష్ణు, డిసిపి సూరజ్ కుమార్, డిఈఈ సతీష్ కుమార్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, సర్వేయర్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

# రైతు పంటకు ప్రభుత్వ భరోసా

**మద్దతు ధరకు శనగల కొనుగోలు -- మార్చి 1 నుంచి 20 కేంద్రాలు రైతులకు అందుబాటులోకి**

**బాపట్ల రక్షణ న్యూస్**



ఆరుకాలశీ భూమిని నమ్ముకొని కష్టపడుతూ పంటలు పండిస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ రైతు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించింది. రైతులు పండించిన శనగలు, మినుములు, పెసరలను ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)తో కొనుగోలు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భావన వశిష్ఠ తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. మార్చి 1వ తేదీ నుంచి జిల్లాలో శనగల కొనుగోలు ప్రారంభించాలని ఆమె ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 20 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 38,840 హెక్టార్లలో శనగ పంట సాగు కాగా, 35,901 హెక్టార్లలో ఈ-క్రాప్ నమోదు అయినట్లు తెలిపారు. మొత్తం 73,860 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఒక క్వింటాల్ శనగకు రూ.5,875లను కనీస మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. బాపట్ల జిల్లాలో రైతుల నుంచి 12,116 క్వింటాళ్ల శనగలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రబీ సీజన్‌లో శనగ కొనుగోలుకు అవసరమైన తేమ యంత్రాలు, గోనె సంచులు, టార్పాలిన్ పట్టాలు సిద్ధం చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు వాహనాలు, రవాణా చార్జీలు, హమాలీల రేట్లు నిర్ణయించాలని ఆదేశించారు. ఒక రైతు రోజుకు గరిష్ఠంగా 40 క్వింటాళ్ల శనగలను విక్రయించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో ప్రచారం చేపట్టాలని సూచించారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ ఏడి కరుణశ్రీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, పౌర సరఫరాల సంస్థ జీఎం శ్రీలక్ష్మి, జిల్లా రవాణా అధికారి పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని అంబటి ర్యాలీ తో ఉద్రిక్తత

**రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి అంబటి రాంబాబు గుంటూరుకు భారీ కాన్వాయ్‌తో ర్యాలీగా బయలుదేరడం జిల్లాలో ఉద్రిక్తతకు దారితీసింది.**

**గుంటూరు రక్షణ న్యూస్**



బెయిల్‌పై విడుదలైన అనంతరం అంబటి రాంబాబు అనుచరులతో కలిసి భారీ కాన్వాయ్‌తో గుంటూరుకు బయలుదేరారు. అయితే ర్యాలీకి ఎలాంటి ముందస్తు అనుమతి లేదని గుంటూరు పోలీసులు స్పష్టం చేశారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద పోలీసులు అంబటి కాన్వాయ్‌ను నిలిపివేశారు. ఈ సమయంలో పోలీసులు, వైసీపీ నేతల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనుమతి లేదని తెలిపినా, పోలీసుల మాటను లెక్కచేయకుండా బారికేడ్లను పక్కకు తోసి ముందుకు వెళ్లే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఈ పరిణామంతో ఇన్నర్ రింగ్ రోడ్డుపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మండుతున్న ఎండలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు అదనపు బలగాలను మోహరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

# భద్రతపై పోలీస్ దృష్టి

**పిట్లలవానిపాలెం రక్షణ న్యూస్**



పిట్లవానిపాలెం మండలం చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ మర్రి వెంకట శివకుమార్ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు, హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులకు అపరాధ రుసుములు విధిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే ముఖ్యమని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించే అలవాటు చేసుకోవాలని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు.

RAKSHANA_praja jyothi Medhak.qxd 2/20/2026 6:01 AM Page 4



# యడ్లపాడు హైవేపై ఘోర ప్రమాదం




**చిలకలూరిపేట రక్షణ న్యూస్**


పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని యడ్లపాడు హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం రాత్రి మూడు వాహనాలు ఢీకొన్న ఘటనలో తీవ్ర ప్రమాదం చోటుచేసుకుంది. ఆటో, బైక్‌ను ఢీకొన్న కారు అదుపుతప్పి హైవే బ్రిడ్జిపై నుంచి వాగులో పడింది.బెంగుళూరు నుంచి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాద సమయంలో కారులో ఉన్న తండ్రి, అతని 10 సంవత్సరాల కుమారుడు సహా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం గుంటూరులోని కాటూరి ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# భార్య దాడి భర్త మృతి

## మంగళగిరిలో దారుణ ఘటనగా

### టీవీ శబ్దం హత్యకు దారితీసింది

**అమరావతి రక్షణ న్యూస్**



మంగళగిరిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. టీవీ సౌండ్ తగ్గించమన్నందుకు భార్య భర్తను కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది.మృతుడిని షేక్ అహ్మద్ (27)గా ఏసీ మెకా నిక్‌గా పనిచేస్తున్న అహ్మద్ కొంతకాలంగా టిడ్కో నివాసంలో క్రాంతితో సహజీవనం చేస్తున్నాడు.గత రాత్రి టీవీ శబ్దం విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన క్రాంతి కత్తితో అహ్మద్‌పై దాడి చేసింది.తీవ్రంగా గాయపడిన అహ్మద్‌ను స్థానికులు వెంటనే విజయవాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు.అయితే, అక్కడ చికిత్స పొందుతూ అహ్మద్ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటన ప్రాంతంలో ఉద్రిక్తతకు దారి తీసింది.

# నాణ్యతతో పనులు సకాలంలో పూర్తి




**జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి.. పనుల పురోగతిపై అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారీయా దిశానిర్దేశం**

**గుంటూరు రక్షణ న్యూస్**

అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు.గురువారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఖాజాలోని యానిమల్ బర్త్ కంట్రోల్ (ఎబిసి) కేంద్రంలో డాగ్స్ కెన్నల్స్, ఆపరేషన్ థియేటర్, ఫుడ్ ఫీడింగ్ ఏరియా, రికార్డులను పరిశీలించి వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కాజాలో రూ. 2.70 కోట్లతో ఈస్ట్ లేక్ వద్ద ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్, పిల్లల పార్కు పనులు, ఎన్ఆర్ఐ సమీపంలో సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న వైట్ ఫీల్డ్ పార్క్ పనులను పరిశీలించారు. పూర్తి స్థాయి పచ్చదనం, వాకింగ్ ట్రాక్ సమతలీకరణపై దృష్టి పెట్టాలని సూచించారు.కాళీమాత దేవాలయం సమీపంలోని యాస్పిరేషనల్ టాయిలెట్లు, కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన 'ఎనీ టైం బ్యాగ్' కియోస్క్ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొలనుకొండలో కమ్యూనల్ స్థలాలపై నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌కు సూచించారు.తాడేపల్లిలో మెప్మా ఆధ్వర్యంలో 40 షాపులతో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ స్థలాన్ని పరిశీలించి, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయాలకు అనుకూలంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఉండవల్లి సెంటర్‌లో రూ. 1.69 కోట్లతో జరుగుతున్న రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలనిఆదేశించారు.నులకపేటలో అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ. 6 కోట్లతో చెరువు అభివృద్ధి పనులు, ప్రకాష్ నగర్‌లో నిర్మించిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ కేంద్రాన్ని పరిశీలించారు. పొడి, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ సమర్థంగా చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తెనాలి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

---

# పార్టీ కార్యకర్తకు పరామర్శ

## అనారోగ్యంతో కార్యకర్త... అన్నివేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా

**బాపట్ల రక్షణ న్యూస్**



బాపట్ల మండలం కొత్త వాడరేవు గ్రామానికి చెందిన పార్టీ బూత్ ఇన్‌ఛార్జ్ వారి సుబ్ర హ్మణ్యం రెడ్డి అనారోగ్యంతో కొంత కాలంగా ఇంటికే పరిమితమయ్యారు. ఈ విషయం తెలిసిన బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.సుబ్రహ్మణ్యం రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వివరంగా అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం కోసం అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు.